క్లుప్తంగా

దశభుజ గణపతి ఆలయంలో జడ్జిల పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జడ్జీల బృందం

రాయదుర్గం: రాష్ట్రంలోనే ఎంతో ప్రతిష్ట కలిగిన దశభుజ గణపతి ఆలయాన్ని ఏపీ హైకోర్టు న్యాయ మూర్తుల బృందం సందర్శించి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తులు వెంకటశేషయ్య, రమేష్, శ్యామ్‌సుందర్‌తో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, స్థానిక జడ్జి లావణ్య, ఇతర న్యాయమూర్తులు, ఎస్పీ ఫక్కీరప్ప, జేసీ కేతన్ గార్గ్, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు తదితరులను ఆలయ కమిటీ చైర్మన్ జయంతి సుబ్రమణ్యం, ఆయన సతీమణి శోభారాణి పూలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారికి వినాయకుడి ఫోటోలను బహూకరించి ప్రసాదాలు అందజేశారు.

ఆలయ వార్షికోత్సవం

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎర్రిస్వామి, మారెప్ప, గోవిందు, అన్నమయ్య, సురేష్, రఘురాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల పంచాయతీ పరిధిలో ఉన్న ఐదు గ్రామాల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు శనివారం ప్రారంభమయ్యాయి. పంచాయతీ పరిధిలోని కొలిమిపాళ్యం సమీపంలో పెద్దవంక్కపై ఎనిమిది ప్రాంతాల్లో చెక్‌డ్యాములు, నీటి ట్యాంకులు నిర్మిస్తున్నట్లు ఆ సంస్థ ఎస్టీఓ రామాంజనేయులు తెలిపారు.అలాగే కెంచంపల్లి, కలిగొలిమి, అప్పాజిపాళ్యం గ్రామాల్లోని పొలాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్, భూఅభివృద్ధి పనులు, పాడిపరిశ్రమ, కుంట కట్టలు వేయడం తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు.

వేసవి దుక్కులతో అధిక దిగుబడి

ఉరవకొండ రూరల్: తొలకరి వర్షాలకు పొలాల్లో వేసవి దుక్కులు చేసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రామసుబ్బయ్య, రవికిశోర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులు, సర్పంచ్‌లు, సిబ్బందికి వేసవి దుక్కులు, పురుగు మందులు, రసాయన ఎరువుల వాడకం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజ, ఏఓ శశికళ, సర్పంచ్‌లు యోగేంద్రరెడ్డి, పల్లి లింగన్న, నాగప్ప, రైతులు భీమేష్, వశికేరి, లాలెప్ప, రామచంద్రానాయక్, రామస్వామి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

‘డ్రైనేజీ సమస్య పరిష్కరించండి’

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్డుపై మురుగు ప్రవహిస్తోందని, సమస్య పరిష్కరించాలని సచివాలయం ఎదుట శనివారం కాలనీ వాసులు నిరసన తెలిపారు. డ్రైనేజీ సమస్యను త్వరిత గతిన పరిష్కరిస్తామని ఎస్‌ఐ రామకృష్ణయ్య, వైస్ సర్పంచ్ పాతన్న, సచివాలయ కార్యదర్శి సుబాంజీరావు తెలపడంతో కాలనీవాసులు శాంతించారు.

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలు



పప్పుశనగ కొనుగోలును పరిశీలిస్తున్న ఏడీఏ

కణేకల్లు: ప్రతి రైతూ పండించిన పప్పుశనగ పంటను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీసమద్దతు ధర రూ.5,335లతో కొనుగోలు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ అన్నారు. కోకుర్తి ఆర్బీకేలో సాగుతున్న పంట కొనుగోళ్ల ప్రక్రియను శనివారం ఏఓ శ్రవణ్‌కుమార్‌తో కలిసి ఏడీఏ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకూ 30 మంది రైతులతో 630 క్వింటాళ్ల పప్పుశనగను కొనుగోళ్లు చేశామన్నారు. రైతులు దళారులకు విక్రయించి మోసపోకుండా.. ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం: తిమ్మసముద్రం గ్రామానికి చెందిన రాళ్లపల్లి మహేష్ (32) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. కొంత కాలంగా అతడు తన తండ్రికి చెందిన భూమిలో టమాట పంట సాగు చేసి లగేజీ బొలెరో వాహనాన్ని నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల టమాట ధరలు పడిపోవడంతో పెట్టుబడులు రాక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం అనంతపురం వెళ్లిన అతడు ఓ పెట్రోల్ బంకు సమీపంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి వున్న అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య కవిత, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధ్యాంక్యూ సీఎం సార్..

- ‘వైఎస్సార్ ఆసరా’ నిధుల విడుదలపై మహిళల హర్షం
- ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా మూడో ఏడాది కూడా ‘వైఎస్సార్ ఆసరా’ నిధులు విడుదల చేయడంపై డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని, సంబరాలు చేసుకున్నారు.



కణేకల్లు: సొల్లాపురంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా కల్పిస్తూ రాష్ట్రంలోని ఆడపడుచులకు అండగా నిలుసున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులు జమ చేసే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని శనివారం ఆమె మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో కలసి వీక్షించారు. ఆమె మాట్లాడుతూ రాయదుర్గం పురపాలక సంఘంలోని 792 సంఘాలకు మూడో విడత ఆసరా కింద రూ.4.56 కోట్ల ఆర్థికసాయం అందిందన్నారు. ఈ నిధులను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని విధాలుగా మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా రుణపడి ఉండాలన్నారు.

కణేకల్లు: టీడీపీ హయాంలో సున్నావడ్డీలు రాక, చేసిన అప్పులు తీర్చలేక అప్పుల్లో కూరుకుపోయిన అక్కాచెల్లెమ్మల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ‘వైఎస్సార్ ఆసరా’ పథకం అందరి జీవితాల్లో వెలుగులు నింపిందని వైకేపీ ఏపీఎం గోవిందప్ప, సర్పంచు కాపు మహేశ్వరి అన్నారు. మండలంలోని సొల్లాపురం గ్రామంలో శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని పొదుపు సంఘాల మహిళలు వీక్షించారు. అనంతరం సర్పంచుతో కలసి మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో వైకేపీ సీసీ రామాంజనమ్మ, ఎర్రిస్వామి, సి.తిప్పేస్వామి, గోవిందు, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: ‘వైఎస్సాఆర్ ఆసరా’ మూడో విడత నిధులు మంజురు చేసేందుకు ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమాన్ని శనివారం ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎల్‌ఈడీ స్కీన్‌లో పార్టీ ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, వైకేపీ అధికారులు వీక్షించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలసిఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జీఎంఎస్ మీరంబాషా, వైకేపీ ఏసీ శివయ్య, కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం కేక్ కట్ చేశారు.

విడపనకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేలును ఎన్నటికీ మరువలేమని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు అన్నారు. శనివారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడతను ప్రారంభిస్తున్న దృశ్యాలను మండంలోని ఉండబండ సచివాలయంలో టీవీలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు తిలకించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునాఫ్, సర్పంచు సుమంగళమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: కళ్యాణదుర్గం నియోజికవర్గంలోని ఐదు మండలాల్లో 4,058 మహిళా సంఘాలకు మూడో విడుత కింద రూ.2,477.43 లక్షల వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరైనట్లు ఐకేపీ డివిజన్ ఏసీ రాధారాణి తెలిపారు. శెట్టూరు మండలంలో 763 సంఘాలకు రూ.415.44 లక్షలు, కుందుర్పిలో రూ.848 సంఘాలకు రూ.601.88 లక్షలు, కంబదూరులో 990 సంఘాలకు రూ.569.39 లక్షలు, కళ్యాణదుర్గంలో 722 సంఘాలకు రూ.436.98 లక్షలు, బ్రహ్మసముద్రంలో 735 సంఘాలకు రూ.453.81లక్షలు మంజూరయ్యాయన్నారు. రెండు రోజుల్లో ఆయా సంఘాల ఖాతాల్లో ఆసరా నిధులు జమ కానున్నట్లు ఆమె తెలిపారు.

నేడు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు

రాయదుర్గం: డి హీరేహాళ్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళలు తరలివచ్చి కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి జయంతి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామ సచివాలయంలో శనివారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ కొనకొండ్లలో ప్రభుత్వాస్పత్రి ఏర్పాటుకు ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీరాములు, పంచాయతీ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక



జశ్వంత్‌నాయక్

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న జ శ్వ ంత్‌నాయక్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తదితరులు అభినందించారు. విద్యార్థికి ఇంటర్ పూర్తయ్యే వరకూ ఏటా రూ.12,000 ఉపకార వేతనం అందుతుందన్నారు.

‘నిందితుడిని కఠినంగా శిక్షించాలి’

శెట్టూరు: నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన దళిత యువతి రమాదేవిని హత్యచేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు టైలర్ వన్నూరుస్వామి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చింతర్లపల్లిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గౌరయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న అధికారులు , సేవా కమిటీ సభ్యులు

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శనివారం దేవదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో శాశ్వత హుండీలోని కానుకలను లెక్కించారు. మూడు నెలలకు రూ.2,39,078 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. అంతకు ముందు అధికారులు జోడు లింగాలకు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో దేవాలయ జీర్ణోద్ధారణ, సేవా కమిటీ సభ్యులు ప్రవీణ్‌స్వామి, ఆర్.క్రిష్టప్ప, సంగప్ప, వెంకటేశులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్ , శాంతిరామ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉద్దేహాల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ శిబిరంలో 190 మందికి కంటి వైద్య నిర్వహించి.. అందులో 122 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, రమేష్, కృష్ణ, సర్మస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తదితరులు

బొమ్మనహాళ్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తలారి రామాంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైస్సార్ సర్కిల్ వద్ద వున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, వాల్మీకి సంఘ నాయకులతో కలసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే ప్రక్రియను ముఖ్యమంత్రి వేగవంతం చేసారన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపారన్నారు. ఇందు వాల్మీకి, బోయ కులస్తులు సీఎంకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు రమనేపల్లి సర్పంచ్ రమేష్, బొమ్మనహాళ్ సచివాలయ కన్వీనర్ పూల ప్రసాద్, నాయకులు పురుషోత్తం రాజు,శిల్పి బాబు, నరిగన్న, హనుమంతురాయుడు, పాతన్న తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: శాసనసభలో బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లో, దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న తీర్మానాలను అసెంబ్లీలో ఆమోదించడంపై మండల వాల్మీకి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ రాధాస్వామి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, వైస్ ఎంపీపీ బీజప్ప, మండల సచివాలయ కన్వీనర్ ఈ.రాము, నాయకులు పెద్ద ఓబిశేసు, రామూర్తి, పెద్దప్పయ్య, బీటీ రాము ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిరక్షరాస్యతపై ఇంటింటా సర్వే

గుమ్మఘట్ట: నిరక్షరాస్యత, ఉపాధి అవకాశాలపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో జాతీయ సేవా పథకం యూనిట్ -3 ఆధ్వర్యంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.నారాయణ మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత, నీటి వృథా, వ్యాధులు, విద్య ప్రాధాన్యత, బాల్యవివాహాలు వల్ల అనర్థాలు గురించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లుగోవర్ధన, రామకృష్ణ, హెచ్ఎం ఆనందరావు, అధ్యాపకులు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి చర్యలు

గుమ్మఘట్ట: స్థానిక పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న మూడు స్టాఫ్ నర్సు పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. శనివారం గుమ్మఘట్టలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు, లేబర్ వార్డు, ల్యాబ్, మందుల నిల్వలను పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంపై స్థానిక వైద్యులతో ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గుర్తించిన ఈ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ నోడల్ అధికారి డాక్టర్ సుజాత, గుమ్మఘట్ట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ బాలాజీనాయక్, సీహెచ్ఓ మురళీధర్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

విడపనకల్లు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ కరణం పుష్పావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, మాజీ సర్పంచు భీంరెడ్డి తదితరులు ఎంపిడీఓ శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ×జగనన్న గోరుముద్ద€ కార్యక్రమంలో భాగంగా రాగిజావ అందిస్తుండటం ఎంతో గొప్ప విషయంమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కురుబ గిరిబాబు, దేశాయ్ సిదార్ధ, కోఆప్షన్ సభ్యుడు లతీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విడపనకల్లు: మండలంలోని మాళాపురంలో ఉన్న కేజీబీవీలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తులసిప్రియ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 2023–24కు సంబంధించి ఇంటర్ చేరే విద్యార్థులు ఈనెల 27లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. 7వ తరగతిలో ఒకటి, 9వ తరగతిలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పశువులకు టీకాలు

కుందుర్పి: మండలంలోని 36 గ్రామాల్లో ఈనెలాఖరు వరకూ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక పశువైద్య సిబ్బందితో కలసి మండలంలోని వివిధ గ్రామాల్లో 150 పశువులకు టీకాలు వేశారు. పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామన్నారు.

‘బీజేపీకి రాహుల్ భయం పట్టుకుంది’

కళ్యాణదుర్గం: బీజేపీ ప్రభుత్వానికి రాహుల్ గాంధీ భయం పట్టుకుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడంపై శనివారం కళ్యాణదుర్గం పట్టణంలో నిరసన చేపట్టారు. స్థానిక టీ సర్కిల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ మోదీ హటావో...దేశ్ బచావో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ సహాయ కార్యదర్శి రాం భూపాల్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు తిమ్మప్ప, ఏ బ్లాక్ అధ్యక్షుడు జియావుద్దీన్, పట్టణ అధ్యక్షుడు బోయ నాగరాజు, మండల కన్వీనర్ రాయపాటి అశోక్, డీసీసీ కార్యదర్శి కొలిమి దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సమైక్య సమితి కమిటీ ఏర్పాటు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఎస్సీ ఎస్టీ సమైక్య సమితి మండల కమిటీని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక నాయకుడు కేపీ నారాయణస్వామి, ఎస్సీ ఎస్టీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు విరూప శ్రీనివాసులు ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మనోజ్‌కుమార్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు రాష్ట్ర అధ్యక్షుడు కాలనీలో ఎస్సీ, ఎస్టీ సమైక్య సమితి నేమ్ బోర్డుకు శంకుస్థాపన చేశారు.

మార్కెట్ వేలం వాయిదా

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘానికి సంబంధించిన దిన, వారపు సంత, జంతువధశాల మార్కెట్ వేలం శనివారం జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. తిరిగి ఎప్పుడు వేలం పాట నిర్వహిస్తామనే విషయాన్ని త్వరలో తెలియజేస్తామన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శెట్టూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ వనజాక్కమ్మ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మంపల్లి, ఎర్రబోరేపల్లి మాకోడికి, మాకోడికి తండా, కరిడిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పిల్లలు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. పిల్లల గైర్హాజరుకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మోనూ ప్రకారం భోజనం వండాలన్నారు. పిల్లలోని అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. సిబ్బందికి సమయపాల పాటించాలని ఆమె సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న బాలామృతం, చిక్కీ, జొన్న పిండి, కర్జూరం తదితర పదర్థాలను సక్రమంగా వినియోగించుకోవాలని లబ్దిదారులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో భూ సర్వే ప్రారంభం



మున్సిపాలిటీ భూములను సర్వే చేస్తున్న డ్రోన్ ఫ్లైట్

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తులను లెక్క గట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే శనివారం ఆస్తుల హద్దులు, భూములను గుర్తించేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రోన్ ఫ్లైట్‌ను రంగంలోకి దింపారు. స్థానిక అక్కమాంబ ఆలయ ఆవరణ నుంచి డ్రోన్ ఫ్లైట్‌ను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 15 వేల ఎకరాల భూములు ఉన్నట్లు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రాథమికంగా తెలిపారు. ఈ మొత్తానికి సంబంధించిన హద్దులను డ్రోన్ ద్వారా గుర్తించనున్నట్లు టీపీఎస్ అలివేలమ్మ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో జీపీఎస్ పాయింట్లను అనుసంధానం చేసుకుంటూ హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఏప్రిల్ 5వ తేదీ నాటికి కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని భూములన్నింటికీ హద్దులు ఏర్పాటు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఇందుకు ఆయా భూముల, స్థలాల యజమానులు సహకరించాలని సూచించారు. కాగా అక్కమాంబ ఆలయ సమీపంలో బుల్లి విమానం లాంటి డ్రోన్ తిరుగుతుండటంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కమిషనర్ వెంకటేశులు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ కృష్ణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కిరీటి యాదవ్, సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

వజ్రకరూరు: పశు పోషణ, పాడి అభివృద్ధికి జగన్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. శనివారం ఉదయం వజ్రకరూరులోని పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం రైతులు, అధికారులతో సమావేశమై మాట్లాడారు. పశు విజ్ఞానబడిని క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తూ పశు పథకాల అమలుపై రైతులను చైతన్య పరచాలని అధికారులకు సూచించారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలన్నారు. రాయితీతో అందజేస్తున్న దాణాతో పాటు గడ్డి కత్తిరించే యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. సమావేశంలో డీడీఏ వెంకటేష్, పశు వైద్యాధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, జేపీఓ భద్రునాయక్, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రససిద్ధేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవ దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణ సమీపంలోని సిద్దుల కొండపై రససిద్ధేశ్వరస్వామి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పట్టణంలోని కోట పాళేగర్ వంశస్తుల తొలి పూజ అనంతరం పూజారుల ఇంటి వద్ద నుంచి స్వామి గుర్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేలాది మంది భక్తుల కోలాహాలం మధ్య రథోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు లాంచనంగా ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం సిడి మాను ఉత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్, తాగునీటి సమస్య లేకుండా చూడండి



అధికారులతో సమావేశమైన ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

ఉరవకొండ: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ఉపవాస దీక్షల్లో ఉంటారని, ఈ సందర్భంలో విద్యుత్, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులను ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కోఆప్షన్ సభ్యుడు పామిడిసలీం ఆదేశించారు. శనివారం ఉరవకొండ ఎంపీపీ చాంబర్‌లో విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉపవాస దీక్షల కోసం సెహరి, ఇఫ్తార్ సమయంలో విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ముస్లింలకు ఇబ్బందులు లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయాలన్నారు. మసీదు ఆవరణలో శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేయించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ గురుమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదా, పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, నాయకులు వడ్ల సలీం, వన్నూర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి

ఉరవకొండ: వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్ మీనుగ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప సూచించారు. శనివారం పంచాయతీ పాలకవర్గ సమావేశం సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ గౌస్ సాహెబ్ ముఖ్యమైన అజెండా పాయింట్లపై చర్చ చేపట్టారు. ప్రజారోగ్య సామగ్రి, స్టేషనరీ, యూనిఫాంల కొనుగోలుకు సీల్డు టెండర్లు పిలవడానికి సభ్యులు ఆమోదం తెలిపారు. పట్టణంలో కోతులు, వీధి కుక్కలను బంధించుటకు ప్రత్యేక చర్యలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడానికి ఆమోదించారు. అలాగే ప్రస్తుతం ఉన్న పంచాయతీ క్వాటర్స్‌ను కూల్చి, అక్కడ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం, సర్వే నెం 538 లో 75 సెంట్ల పబ్లిక్ పర్పస్ స్థలంలో పార్కు ఏర్పాటు చేయడానికి పంచాయతీ సభ్యులు ఆమోదం తెలిపారు.